క్లుప్తంగా

ఈకేవైసీ తప్పనిసరి

తంబళ్లపల్లె: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్‌విండో)లో సభ్యత్వం పొందిన వారు, ఖాతాదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ భార్గవరెడ్డి, సీఈవో భాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దీర్ఘ, స్వల్పకాలిక, రుణాలు పొందిన వారు, సభ్యత్వం ఉన్నవారు ఆధార్ కార్డు, రెండు ఫోటోలు, 1–బి జిరాక్స్ కాపీలు సింగిల్‌విండో కార్యాలయంలో అందజేసి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు.

17న సయ్యద్ నాథషావల్లి ఉరుసు



మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం రైల్వేగేటు వద్దనున్న హజరత్ ఖాజా సయ్యద్ నాథషావల్లి బాబా ఉరుసు ఉత్సవాలు ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి 6 గంటలకు ప్రారంభమయ్యే గంధోత్సవాన్ని మొరవణి ఫకీర్ల వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగింపు జరుగుతుందన్నారు. అనంతరం బాబా మజ్జార్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు, దువా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కుల,మతాలకు అతీతంగా హిందు, ముస్లింలు పాల్గొనాలని కోరారు.

పార్కింగ్ వసూళ్లకు వేలం

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాహనాల పార్కింగ్ వసూళ్లకు వేలం పాట నిర్వహించారు. సోమవారం మల్లయ్యకొండపై ఆలయ చైర్మన్ మల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవికిరణ్ కుమార్ రెడ్డి, ఈవో రమణల ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా మెకానిక్ శేఖర్ రూ.3,83,500లకు పాట దక్కించుకున్నారు. ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

వాల్మీకిపురం: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వాల్మీకిపురం సీఐ పులిశేఖర్ తెలిపారు. వివరాలిలా.. వాల్మీకిపురం పట్టణం నమాజ్‌కట్టవీధికి చెందిన వెంకటరమణ కుమారుడు నరసింహులు (36) అక్రమంగా కర్ణాటక మద్యంను తరలిస్తున్నాడు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. కారులో 48 క్వార్టర్ బాటిళ్లు, 1350 లిక్కర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, అతడిని అరెస్ట్ చేశారు. అలాగే కారును సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు నాగేశ్వర రావు, క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతల


వాల్మీకిపురం: పట్టణ ప్రముఖుడు, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చిన్నాన చింతల సూర్యనారాయణ రెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తన చిన్నాన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పట్టణ ప్రముఖులు సూర్యనారాయణ రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్యే చింతల వెంట చింతల ఆనంద రెడ్డి, నల్లారి తిమ్మారెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కురబలకోట ఎంపీడీఓగా హరినారాయణ



కురబలకోట: మండల నూతన ఎంపీడీఓగా ఎ. హరినారాయణ నియమితులయ్యారు. ఇదివరలో ఆయన ఇక్కడ నుంచి అన్నమయ్య జిల్లా రాయచోటిలో డీఎల్‌పీఓగా డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించేవారు. ఎన్నికలను నేపథ్యంలో డిప్యుటేషన్లను రద్దు చేయడంతో ఆయన తిరిగి కురబలకోటలో ఎంపీడీఓగా విధుల్లో చేరారు. ఇక్కడ ఎంపీడీఓగా ఉన్న దిలీప్‌కుమార్ తంబళ్లపల్లె ఈఓఆర్డీగా విధుల్లో చేరారు .

మండల కోఆప్షన్ సభ్యుడు మృతి



రెడ్డిబాషా (ఫైల్)

పీలేరు : పీలేరు మండల కోఆప్షన్ సభ్యుడు రెడ్డిబాషా అనారోగ్యంతో మృతి చెందాడు. పట్టణానికి చెందిన రెడ్డిబాషా వైఎస్సార్‌సీపీలో సీనియర్ నాయకుడిగా పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్నారు. మండల కోఆప్షన్ సభ్యుడుగా ఉన్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ ఆయన మృతి పట్ల ప్రగాడ సంతాపం తెలిపారు.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే

- చేతుల శుభ్రతతో మెరుగైన ఆరోగ్యం
- మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి



మున్సిపాలిటీలో హ్యాండ్‌వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే ఉంటుంది. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా 80 శాతం అంటువ్యాధులు, ప్రాణాంతక వ్యాధులు దూరమవుతాయని, చేతుల శుభ్రతతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్‌వాష్ స్టేషన్‌ను చైర్‌పర్సన్ మనూజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కరోనా కాలంలో చేతుల పరిశుభ్రతపై అందరికీ అవగాహన వచ్చిందన్నారు. అయితే అలాంటి ఆపత్కాలంలోనే కాదు.. ఎల్లవేళలా చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఆరోగ్యానికి మంచిదన్నారు. ముఖ్యంగా చిన్నారులకు చేతుల శుభ్రతపై అవగాహన పెంచితే చాలా వరకు రోగాలు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. రోజు చేతులు మారే కరెన్సీతో పాటు, ప్రతిచోటా చేతులు పెట్టడం ద్వారా మనకు క్రిముల రూపంలో వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. వివిధ రకాల రోగాలున్న వారి నుంచి రోగకారక క్రిములు మన చేతికి వస్తున్నందున, అవి మన శరీరంలోకి వెళ్లే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపాలిటీకి వివిధ పనుల మీద వివిధ రకాల ప్రజలు వస్తుంటారని, వారందరి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మెప్మా ఆధ్వర్యంలో హ్యాండ్‌వాష్ స్టేషన్ ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గుండ్లూరుషఫీ, మెప్మా సీఎంఎం రవి, సీఓలు భాను, నాగేంద్ర, ఆర్పీలు పాల్గొన్నారు.

విగ్రహాల దాతకు పరామర్శ



పెద్దపెంచులయ్యను పరామర్శిస్తున్న ఆలయ చైర్మన్లు

పీలేరురూరల్ : అనారోగ్యంతో బాధపడుతున్న విగ్రహాల దాత, శ్రీ రౌద్రాల అంకాలమ్మ ఆలయ మాజీ చైర్మన్ నారకట్ల పెద్దపెంచులయ్యను వివిధ ఆలయాల చైర్మన్లు పరామర్శించారు. సోమవారం ఆయన నివాసంలో కలసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్, రిటైర్డ్ ఏఎస్పీ సూర్యనారాయణరెడ్డి, రామాలయ చైర్మన్ కోడి రామకృష్ణారెడ్డి, సాయిబాబా ఆలయ చైర్మన్ డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ చిత్తూరు, కడప ఉమ్మడి జిల్లాలో సుమారు 190 ఆలయాలకు విగ్రహాలు ఉచితంగా అందించిన పెద్దపెంచులయ్య అనారోగ్యంతో ఉండడం బాధాకరమన్నారు. ఆయనకు భగవంతుడు ఆరోగ్యం ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో అరవ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు సింగిల్ విండో నూతన భవనం ప్రారంభం

కురబలకోట: మండలంలోని జంగావారిపల్లె జడ్పీ హైస్కూల్ ఎదురుగా రూ. 50 లక్షలతో నిర్మించిన సింగిల్ విండో నూతన (పీఏసీఎస్) భవన్నాన్ని బుధవారం ఉదయం ప్రారంభిస్తున్నట్లు డీసీసీబీ డైరెక్టర్, సింగిల్ విండో చైర్ పర్సన్ గంగసాని అరుణమ్మ తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి, జిల్లా డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ఖాతాదారులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుడి నియామకం

గుర్రంకొండ: బీజేపీ మండల అధ్యక్షుడిగా సంగసముద్రం గ్రామానికి చెందిన రామాంజులును నియమించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రామాంజులు నియామకం పట్ల బీజేపీ నాయకులు చింతిర్ల శ్రీనివాసులు,గౌరీ హోటల్ శీనా, రెడ్డిమునినాయుడు, భరత్, నక్కానాగరాజు, వరదరాజులు హర్షం ప్రకటించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

తంబళ్లపల్లె: గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండరాదని ఎంపీడీవో కృష్ణమూర్తి హెచ్చరించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు సకాలంలో అందించాలన్నారు. జగనన్న కాలనీలలో లబ్ధిదారుల ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్‌చేసే పక్రియ వేగవంతంచేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కార్యాలయ ఏవో ఆనందకుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

సంబేపల్లె : గ్రామాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఇందిరా నగర్ కాలనీలో దాదాపు రూ. 15 లక్షలతో సిమెంట్ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిల సహకారంతో గ్రామాల సమగ్రాభివృద్ధి జరుగుతోందన్నారు. ఇప్పటికే సంబేపల్లెలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్ర, ఈఓపీఆర్‌డీ రవీంద్ర, ప్రసాద్ రెడ్డిలు పాల్గొన్నారు.

నిబంధనలకు వ్యతిరేకంగా సిబ్బంది నియామకం

బీటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆనందరెడ్డికి వినతిపత్రం



బీటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆనందరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బహుజన్‌యువసేన నాయకులు

మదనపల్లె: బిసెంట్ థియోసఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టీచింగ్, నాన్‌టీచింగ్‌స్టాఫ్ జాబితాలో అనర్హులకు చోటు కల్పించి, అర్హులకు అన్యాయం చేశారని బహుజన యువసేన, ఆర్‌ఎస్‌ఎఫ్ సంఘాల నాయకులు పునీత్, ఉత్తన్న తెలిపారు. సోమవారం బహుజన యువసేన, ఆర్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో.. బీటీ ప్రభుత్వ కళాశాల విలీన ఉద్యోగుల ఎంపిక జాబితాలో అక్రమాలపై కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద రెడ్డి, సబ్‌కలెక్టరేట్‌లో ఏఓ రఫీక్‌అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ విలీన సమయంలో కాలేజ్‌లో పనిచేస్తున్న టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ జాబితాను పంపాల్సిందిగా ప్రభుత్వం కోరితే... అప్పటి కరస్పాండెంట్ వైఎస్.మునిరత్నం అర్హత కలిగిన వారిని కాకుండా కనీసం డిగ్రీ సర్టిఫికెట్లు లేని వారిని టీచింగ్ స్టాఫ్ జాబితాలో, దాదాపుగా కాలేజీలో 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌ని పక్కకుపెట్టి, అర్హత లేని వారి పేర్లను ప్రభుత్వానికి పంపించారన్నారు. అర్హులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎఫ్ నాయకులు ఉత్తన్న, బీవైఎస్. నాయకులు చిరంజీవి, నవీన్,సుధాకర్, శశి, ఆది, మోహన, దేవేష్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు భోజన వసతి

రాయచోటి టౌన్ : జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారులకు అందించే ఉచిత భోజన కార్యక్రమం 47వ వారానికి చేరుకుంది. ఈ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్ ద్వారా జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు పలు రకాల విషయాలపై ఫిర్యాదులు సమర్పించేందుకు అనేక మంది వస్తుంటారు. వారి ఆకలి తీర్చేందుకు ఆయన తన సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

పార్వతీ, కాశీవిశ్వేశ్వరుల విగ్రహాల ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో కాశీశ్వరస్వామి విగ్రహం

రామసముద్రం: రామసముద్రం మండలం మూగవాడి పంచాయతీ ఎం.గొల్లపల్లి గ్రామంలో సోమవారం వైభవంగా శ్రీపార్వతీ కాశీశ్వరుల విగ్రహాల ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఉదయం భక్తి శ్రద్ధలతో శ్రీమహాగణపతి ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ధర్మకర్తలు, ఆలయ అర్చకులు విజయ, మానేరూపావిశ్వనాథ్(పెద్దరాజన్న) , పావని, సుజ్ఞానమూర్తి, (చిన్నరాజన్న) కుటుంబ సభ్యులు , గ్రామస్తుల సహకారంతో ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులచే వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరైయ్యారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బి.నవీన్‌కుమార్, వి.నారాయణ, మంజునాథ్, వీరన్న, ఉమేష్, చంద్రకళ, రెడ్డివీరేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు నాగరికతకు ప్రతీకలు

చిన్నమండెం : ఆలయాలు నాగరికతకు ప్రతీకలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. చిన్నమండెం మండలం దిగువగొట్టివీడు గ్రామం దిన్నెమీదపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్ల విగ్రహ ప్రతిష్ట పూజల్లో ఎమ్మెల్యే, దేవనాథరెడ్డితో కలిసి పాల్గొన్నారు. నాయకులను గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. వారిచేత ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహింపజేసి తీర్థప్రసాదాలు అందజేయడంతోపాటు దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలు మాట్లాడుతూ సీతారాముల ఆలయాన్ని గ్రామస్తులు, దాతలు సమష్టిగా నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. సీతారాముల కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజమ్మ, వెంకటరమణ, ఎంపీటీసీ శ్రీదేవి, నరేష్‌స్వామి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మద్దిరెడ్డి, మల్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, రమణారెడ్డి, శేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకటరమణ, రెడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు, టీబీ వ్యాధుల నివారణపై అవగాహన

పెద్దతిప్పసముద్రం: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులకు సోమవారం ఆరోగ్య వైద్య సిబ్బంది కుష్టు, టీబీ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. వ్యాధులను గుర్తించే విధానం, ఎలా సంక్రమిస్తాయి, వాటి చికిత్సా విధానంపై క్షుణంగా వివరించారు. అదే విధంగా పరిసరాల పరిశుభ్రత, ఆహారపు అలవాట్లపై పలు సూచనలిచ్చారు. స్థానిక ప్రిన్సిపాల్ శివకుమారి, డీపీఎం శ్రీనివాసులు, సీహెచ్‌వో లక్ష్మీపతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి కొరత తలెత్తకూడదు

రాయచోటి అర్బన్ : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణ పరిధిలో ఎక్కడా నీటి కొరత తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో పట్టణంలో ఎక్కడా నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన కమిషనర్ మంగళవారం పట్టణ పరిధిలోని పలు నీటి సరఫరా బోర్లు, నీటి నిల్వలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తరచూ నీటి సమస్య ఎదురవుతున్న పాతగొల్లపల్లె, పాత రాయచోటి ఏరియాలో పర్యటించి, బోర్లను పరిశీలించారు. నీటి సరఫరా అంశంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలంటూ ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్ అధికారులకు సూచించారు.

ఆకట్టుకొన్న రెడ్డెమ్మతల్లి హరికథ



హరికథా కాలక్షేపం నిర్వహిస్తున్న ప్రమీలా

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి హరికథ భక్తులను ఎంతాగానో ఆకట్టుకొంది. రాష్ట్ర దేవదాయశాఖ ఆధ్వర్యంలో ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక ఆలయంలో భగవతారిని ప్రమీలా రెడ్డెమ్మతల్లి ప్రాశస్త్యము, జీవిత చరిత్ర గురించి చక్కగా హరికథ రూపంలో వివరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి హరికథను ఆలకించారు. కార్యక్రమంలో రెడ్డెమ్మ కొండ ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఈవో మంజుల, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుష్టు నివారణకు ఉచితంగా మందులు



కుష్టు నివారణపై అవగాహన కల్పిస్తున్న శంభూప్రసాద్

కలకడ : కుష్టు వాధిని నివారించడానికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తోందని జిల్లా న్యూక్లియస్ టీమ్ అధికారి శంభూప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని కదిరాయచెర్వు జిల్లాపరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జవహర్‌బాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్టు అనేది మైకో బ్యాక్టీరియ లేప్రే సూక్ష్మక్రిమి వలన సంక్రమిస్తుందన్నారు. చర్మంపై రాగిరంగులో స్పర్శలేని మచ్చలు ఏర్పడినప్పుడు వెంటనే వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వాధి లక్షణాలను ప్రారంభ దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం చేసుకోవచ్చునని తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తులు ఆరుగురికి యంసీఆర్ చెప్పులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రసన్నలక్ష్మి, హెచ్‌ఎం సుధాకర, ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, సిబ్బంది సుజాత, కుమారి, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై శ్రీనివాసుడు



సింహవాహనంపై శ్రీనివాసుడి ఊరేగింపు దృశ్యం

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌బట్టార్, అర్చకులు రమేష్‌బాబు శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం ముత్యపు పందెరి, రాత్రి సింహవాహనంపై స్వామివారిని సంప్రదాయ బద్ధంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్, ఇన్స్‌పెక్టర్ డిశ్యంత్‌కుమార్ పాల్గొన్నారు.

జూనియర్ లైన్‌మన్‌పై దాడి

కలకడ : నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు అందించడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులకు హాజరైన జూనియర్ లైన్‌మన్‌పై దాడి చేసి కులంపేరుతో దూషించి, విధులకు ఆటంకం కలిగించారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెలో ఆయిల్ రోటరీలు, యంత్రాలు అధికంగా ఉండటంతో అక్కడ విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేసిన 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్ లోడు తట్టుకోలేక కాలిపోతోందని, అదే స్థానంలో 163 కెవి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలకడ మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీలో విద్యుత్‌శాఖలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న మనోహర్‌ను పీలేరు ఆ శాఖ ఏడీ, కలకడ ఏఈల ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ కార్మికులతో విద్యుత్ మరమ్మతుల కోసం వెళ్లాడు. యర్రయ్యగారిపల్లె గ్రామానికి చెందిన యర్రయ్యగారి ఆనంద, రేవూరి మధుసూదన్ కలుగజేసుకొని ఆయిల్‌రోటరీకి విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వెంటనే విద్యుత్ సర్వీసు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు కొంత సమయం పడుతుందని లైన్‌మన్ చెప్పినా వినకుండా ఆవేశానికి లోనై అతడిపై దాడి చేసి కులంపేరుతో (సుగాలి) దూషించారు. ఈమేరకు బాధితుడు కలకడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించండి



ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : పట్టణంలోని ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు మున్సిపల్ సిబ్బంది కృషిచేయాలని చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఆమె ప్రజాసమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం, మండలంలోని బసినికొండ గ్రామసర్వేనెం 253/5లో దళితురాలైన వెంకటమ్మకు కేటాయించిన భూమిలో మున్సిపల్ కార్యాలయ నిర్మాణం చేస్తున్నట్లుగా కౌన్సిల్ తీర్మానం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణం సదరు స్థలంలో భవన నిర్మాణ ప్రతిపాదనను విరమించుకుని, పేద దళిత మహిళకు న్యాయం చేయాల్సిందిగా వినతిచేశారు. చలపతిరావు కాలనీలో పబ్లిక్‌హెల్త్ వర్కర్స్ క్వార్టర్స్‌లో బయటివ్యక్తులు తాగి, అసభ్యంగా ప్రవర్తించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పి.హరిప్రసాద్ ఫిర్యాదుచేశారు. శ్రీవారినగర్–2లో మట్టిరోడ్లు కారణంగా వర్షాకాలంలో నీరు ఇళ్లలోకి రావడం, రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని కాలనీవాసులు ఫిర్యాదుచేశారు. జగనన్నలేఅవుట్ నెం.11లో రోడ్లు, కాలువలు, వీధిలైట్లు సౌకర్యం కల్పించాల్సిందిగా ప్రజలు వినతిచేశారు. శేషమహల్ ఏరియాలో కుక్కలబెడద అధికంగా ఉందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.

అప్రెంటిస్ విధాన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అప్రెంటీస్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు జీఓ ప్రతులను దగ్ధం చేశారు. సోమవారం స్థానిక డైట్ పాఠశాలలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, రాయచోటి అధ్యక్షుడు రాజారమేష్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించక పోగా కావాలనే కొత్త సమస్యలను సృష్టించడం తగదన్నారు. నోటిఫికేషన్ విడుదల చేయడం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులను, నిరుద్యోగులను మోసం చేస్తుండడం సిగ్గుచేటన్నారు. నోటిఫికేషన్‌లో సుదీర్ఘకాలం పోరాటం చేసి రద్దు చేసుకున్న అప్రెంటిస్ విధానాన్ని తిరిగి పునరుద్ధరింపజేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారన్నారు. వెంటనే నోటిఫికేషన్‌తోపాటు అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు తిరుపతి, అన్వర్‌బాషా, మధుసూదన్‌రాజు, హరిక్రిష్ణ, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

సాల్ట్ శిక్షణా కార్యక్రమాన్ని వాయిదా వేయాలి

జిల్లాలో ఈనెల 13వ తేదీ నుంచి 22వ తేదీ వరకు సబ్జెక్టు ఉపాధ్యాయులకు టీచ్ టూల్ అంశంపై నిర్వహింపతలపెట్టిన సాల్ట్ పథకం శిక్షణా కార్యక్రమాన్ని వెంటనే వాయిదా వేయాలని హరిప్రసాద్, రాజరమేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం వారు ఈమేరకు డీఈఓ కార్యాలయ ఏడీకి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులకు కార్యాచరణ ప్రణాళిక నిర్వహిస్తుండడం, ప్రీ ఫైనల్ పరీక్షలు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వవలసిన అవసరం ఉందన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని సాల్ట్ శిక్షణను వాయిదా వేయాలంటూ కోరారు.

ప్రతి ఒక్కరూ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

రాజంపేట : రాజంపేట మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ మెజార్టీని కైవసం చేసుకునేలా పట్టణ నేతలు సమైక్యంగా కలసిమెలసి, సమన్వయంతో కృషి చేయాలని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం ఆకేపాటి ఎస్టేట్‌లో మున్సిపాలిటీ స్థాయి వైఎస్సార్‌సీపీ నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలంటే రాజంపేట కోటపై మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు. అన్ని వర్గాలకు సీఎం చేసిన మేలును ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా జగనన్నకు వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక విషం కక్కుతున్నారన్నారు. వాటన్నింటిని తిప్పికొట్టే విధంగా పట్టణ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాజంపేట అంటే రాజన్నదే అన్నట్లు పట్టణంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీ సాధించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనరు కృష్ణారావు యాదవ్, పట్టణ జేసీఎస్ కన్వీనరు వడ్డె రమణ, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరక్టరు గండికోట గుల్జార్ బాషా, బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర నేత వెంకటేశు, కో–ఆప్షన్‌సభ్యుడు రాము యాదవ్, కౌన్సిలర్లు కూండ్ల రమణారెడ్డి, పసుపులేటి సుధాకర్, రహంతుల్లా, సూరి, మైనార్టీ నాయకులు జావిద్, మునాఫ్, మసూద్, ఖాదరబాషా, బీసీ నాయకులు మీసాల వెంకటసుబ్బయ్య, మురళీ ఆచారి, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌నాయుడు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.